# పుత్రధర్మం

"ఏవండీ! నాకు... బ్రతకాలనుందండీ!" నలభై అయిదేళ్ళ దాంపత్య జీవితంలో భార్య భానుమతి కోరిన మొదటి కోరిక. అపస్మారకస్థితిలోకి వెళ్తూ మాట్లాడిన చివరి మాటది. అనంతరామయ్యకు దుఃఖం పొంగుకు వచ్చింది. అతడి గాజుకళ్ళల్లో రంగు వెలసిన ముత్యాల్లా అశ్రుకణాలు.

సహజీవన పయనంలో భర్తనుండి ఏనాడూ ఏదీ ఆశించలేదామె. చీరలు, నగలు చివరకు ఓ మూరెడు మల్లెలు కూడా నోరుతెరచి అడగలేదు.

ఒక ఏకాంతవేళ, "నీకంటూ కోరికలేం లేవా భానూ?" అని భార్యతో అతనన్నప్పుడు.

"నా అవసరాల్ని కనిపెట్టి సమయానికి అన్నీ సమకూర్చే దేవుడులాంటి మీరుండగా నాకేం లోటండీ!" అంది.

"అలాకాదుగానీ! నేను మనస్ఫూర్తిగా అడుగుతున్నాను. కాబట్టి నువ్వు కూడా మనసు విప్పి నీకేంకావాలో చెప్పు. అదెంత కష్టసాధ్యమైనా సరే, నీ ముచ్చట తీరుస్తాను." అన్నాడు లాలనగా ఆమెని దగ్గరగా తీసుకుంటూ.

బదులుగా భర్తకి నచ్చేలా ఓ నవ్వు నవ్వింది.

ముగ్ధుడయ్యాడతను.

రెండుఘడియల కాలం నిశ్శబ్దంగా దొర్లిపోయిందిద్దరి మధ్యనుండి. అప్పుడందామె.

"ముత్తైదువుగా మీ చేతుల్లో కనుమూయాలనుంది. ఈ జీవితానికి అదొక్కటి

చాలండీ!" అని.

ఆమె కళ్ళల్లో ఆనందభాష్పాలు.

చప్పున భార్యనోరు మూసాడు అనంతరామయ్య.

సహధర్మచారిణి ప్రేమాపాశానికి ఒక్కక్షణం వివశుడై తన గుండెకి ప్రేమతో హత్తుకున్నాడామెని.

ఆ ఘటన గుర్తొచ్చి అనంతరామయ్య హృదయం విలవిల్లాడింది.

ఆవేదనని పళ్ళబిగువన అదిమిపట్టాడు.

చిక్కి శల్యమై, మరణానికి చేరువై, నిస్త్రాణంగా హాస్పిటల్ బెడ్‌మీద పడివున్న భార్యవంక ఆర్తిగా చూశాడు.

'బతికించుకోవాలి. తన ప్రాణేశ్వరి ప్రాణాల్ని దక్కించుకోవాలి.' అనుకున్నాడు గట్టిగా... అనుకున్నదే తడవుదిక్కున లేచాడు.

పేషెంట్‌ని నర్స్‌కి అప్పచెప్పి గబగబా బయటకు నడిచాడు.

"నిజానికి పేషెంట్ చావుబతుకుల్లో వుంది. అయితే ఆమె నెర్వస్ సిస్టమ్ చెక్ చేసి, సిటి స్కానింగ్ రిపోర్ట్స్ పరిశీలించాక ఆమె బతికి బయట పడొచ్చనిపిస్తోంది. మా శాయశక్తులా ప్రయత్నిస్తాం. సమయానికి అమెరికా డాక్టర్ జేమ్స్ డిసౌజాగారు కూడా మా అభ్యర్థన మేరకు ఇండియా విజిట్‌కి వస్తున్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్ పేషెంట్స్ కొందరిని ఆయనకి చూపించాలని నిర్ణయించాం. ఆ లిస్ట్‌లో మీ ఆవిడ కూడా వుంది. వైద్యానికి సుమారు రెండు లక్షలు అవుతుంది. ఆ ఖర్చుకు మీరు వెనుకాడకపోతే మీ వైఫ్ మీకు దక్కుతుంది."

డాక్టర్ మాటలు చెవుల్లో మార్మోగుతుంటే మనసులో ఇలా అనుకున్నాడు అనంతరామయ్య.

'ఆపరేషన్ సక్సెస్ అయి తన ఇల్లాలు మునుపటిలా తిరుగాడాలి కానీ, రత్నాల్లాంటి ముగ్గురు కొడుకులుండగా డబ్బు గురించి దిగులెందుకు?' అని.

అనంతరామయ్యకు ఆడపిల్లల్లేరు. ఉన్న ముగ్గురు కొడుకుల్నీ ఏలోటు లేకుండా పెంచాడు. తెలుగు పండితుడిగా కాలం వెళ్ళదీసి వాళ్ళందర్నీ ప్రయోజకుల్ని చేయగలిగాడు.

అందరికీ ఉద్యోగాలు దొరికాయి. పెళ్ళిళ్ళు జరిగాయి. పిల్లలు పుట్టారు. ఇప్పుడెవరకి వారే విడిగా కాపురముంటున్నారు.

★ ★ ★

"నాన్నా ! ఎన్నిరోజులయ్యింది మిమ్మల్ని చూసి. మేమే వచ్చి మిమ్మల్ని కలుద్దామను కున్నాం. ఇంతలో మీరే వచ్చారు" తండ్రిని చూసి పలకరించాడు పెద్దకొడుకు రవిశంకర్.

ఏం మాట్లాడలేదు అనంతరామయ్య.

"మీ మనుమరాలు శ్రావణికి పెళ్ళి కుదిరించి నాన్నా ! ఇంటర్ పూర్తయ్యేదాకా ఆ

ఆలోచన వద్దనుకున్నాం మొదట. అనుకోకుండా మంచి సంబంధం వెతుక్కుంటూ వచ్చింది. అబ్బాయి మొన్నటి టీచర్ సెలెక్షన్‌లో సెలక్టయ్యాడట. బావున్నాడు. వాళ్ళంతట వాళ్ళేవచ్చి అడిగితే కాదనలేకపోయాం. కట్నం కింద రెండులక్షలు ప్లస్ స్కూటర్ అడిగారు. ఒప్పేసుకున్నాం." అంటూ ఆగాడు.

తండ్రి ముఖంలో గూడుకట్టుకున్న విషాదాన్ని గుర్తించలేదు.

తిరిగి "మాటల్లోపడి మరిచేపోయాను. అంతా కులాసా కదా! అమ్మెలా వుంది?" అని ప్రశ్నించాడు.

భార్య ప్రసక్తిరాగానే అనంతరామయ్య కళ్ళల్లో నీళ్ళు చేరాయి. గుండెలో దుఃఖం సుడులు తిరుగుతుంటే వణుకుతున్న పెదాల్ని బిగపట్టాడు.

తండ్రి తల పక్కకు తిప్పుకుని గుడ్ల నీరు కుక్కుకోవడం చూసి రవిశంకర్ అడిగాడు.

"అలా వున్నారేంటి నాన్నా? అమ్మ..."

"మీ అమ్మ చావుబతుకుల్లో వుందిరా..." చెబుతోంటే ఆయన కంఠం పూడుకు పోయింది

"అమ్మకేమైంది? చెప్పనైనా లేదు." ఆత్రంగా అడిగాడు.

"చెప్పే టైమెక్కడిది. హాస్పిటల్లో జాయిన్ చేసి పరుగెత్తుకు వచ్చాను. అపస్మారక స్థితిలో వుందిప్పుడు. ఆపరేషన్లు, టెస్టులూ చేయాలిట. రెండు లక్షలవుతుందని డాక్టర్లు చెప్పారు." గుక్క తిప్పుకోకుండా చెప్పి కొడుకు వంక ఆశగా చూసాడా తండ్రి.

"అమ్మో! అంత డబ్బే?" రవిశంకర్ నోటినుండి అప్రయత్నంగా వెలువడ్డాయా మాటలు.

"ఫారిన్ నుండి డాక్టరొస్తున్నాడట." చెప్పాడు అనంతరామయ్య.

"ఆపరేషన్ అంత అవసరమటనా?" అడిగాడు.

అనంతరామయ్యకు అర్థమవుతోంది. మాటల్లోనే కొడుకు ఆంతర్యం వెల్లడవుతోంది.

"మీ అమ్మ అవసరమనుకుంటే!" అన్నాడు చప్పున.

తండ్రీకొడుకుల మధ్య కాసేపు మాటలు కరువయ్యాయి.

రవిశంకర్ కూడా తండ్రిరాకకి గల కారణాన్ని గ్రహించాడు.

"అంత డబ్బంటే ఎలా నాన్నా! అమ్మాయికి కట్నం సమకూర్చడమెలా అని సతమత మవుతున్నాను. తమ్ముళ్ళూ, మీరు కలిసి తలా ఇంత సాయం చేస్తే తప్ప పెళ్ళి పూర్తిచేయలేని పరిస్థితి. మధ్యలో ఈ అనుకోని అవాంతరం." అంటూ నిట్టూర్పు వదిలాడు.

అతడి ఫీలింగ్ మారింది. ఫేసు మార్చాడు.

"మీరు పనిగట్టుకుని వచ్చారు కనుక హాస్పిటల్ ఖర్చులకంటే ఓ అయిదువేలు సర్దగలనేమో!" చెప్పాడు శంకర్.

'తల్లి చావుబతుకుల్లో వుందంటే ముష్టి వేసినట్లు అయిదువేలా? అరేయ్! నీవు పసివాడిగా ఉన్నప్పుడు మలేరియా సోకి నీవు బతకడం కష్టమని డాక్టర్ పెదవి విరిచినప్పుడు నీ కోసం నీ తల్లి ఎంత తల్లడిల్లిందో తెలుసురా? "డబ్బెంత ఖర్చయినా ఫర్వాలేదు. మనబాబు... బ్రతకాలండీ!" అంటూ మెడలో పసుపు తాడేసుకుని, తాళితో సహా ఒంటిమీదున్న నగల్ని అమ్మేయమని ఇచ్చిందిరా. ఇప్పటికీ దాని మెడలో సూత్రాలు తప్ప వీసమెత్తు బంగారం లేదు. అది నీకు కన్నతల్లికాదురా పునర్జన్మ ప్రసాదించిన... దేవతరా!'

గుండెని చీల్చుకుని పెదవి చివర్దాకా వచ్చిన భావోద్వేగాన్ని బలవంతంగా అణిచి పెట్టాడు.

పైకి మాత్రం-

"వద్దురా! పెళ్ళి పందిరికో, మరో దానికో ఉపయోగపడుతుంది. ఆ డబ్బు కూడా నీ దగ్గరే ఉండనీ" అంటూ లేచాడు.

"అదేంటీ మావయ్యా ! భోం చేయకుండానే..."

చివర్లోనైనా పలకరించిన కోడలి వైపు కన్నెత్తి చూడకుండానే, "భోజనం చేసే తీరిక లేదమ్మా. వస్తా." అన్నాడు అనంతరామయ్య.

వేదనాభరితమైన గుండెని చిక్కుపట్టుకుని ఆవేదనగా కదిలాడక్కడినుండి.

★ ★ ★

తలొంచుకుని లోపలికి వస్తున్న తండ్రిని చూస్తూనే. "ఒక్కరే వచ్చారు. అమ్మని తీసుకురాలేదేం?" అంటూ ఎదురుగా వెళ్ళిపలకరించాడు రెండవ అబ్బాయి చంద్రశేఖర్.

"ఆమెని దేవుడు తీసుపోతానంటున్నాడురా." ఆయన కంఠం పూడుకుపోతుంటే కుర్చీలో చతికిలబడ్డాడు.

కాలం కరిగిపోతుంటే ఆయన గుండె వేగం పెరిగిపోయింది.

"మీరనేది అర్థం కావడం లేదు. అమ్మకేమీ కాలేదుగా?" ఆందోళన కనపడింది శేఖర్ గొంతులో.

కోడలు కూడా ఆతృతగా తొంగిచూసింది మామగారి ముఖంలోకి.

పెదాలు బిగపట్టి బాధను దిగమ్రింగుకుంటూ భార్య అనారోగ్య విషయం చెప్పాడు.

"అయ్యో! చెప్పరేం. పదండి వెళదాం." అన్నాడు శేఖర్ లేవబోతూ.

"తక్షణం వెళ్ళి చేయాల్సిందేం లేదు. ఆ రెండు లక్షలు సర్దగలిగితే చాలు. అమ్మ బ్రతికినట్లే." అన్నాడు అనంతరామయ్య.

అప్పుడు తగ్గాడు శేఖర్ వెనక్కి.

ఒక్కక్షణం మౌనంగా వుండిపోయి తండ్రితో అన్నాడు.

"నాన్నా! పెద్దాడు శశాంక్ ఎమ్ సెట్ రాశాడు. పేమెంట్ సీటొచ్చింది. పంపించాలను

కుంటున్నాను." అంటూ "శశా తాతగారి దగ్గరకు రా!" కొడుకుని పిల్చాడు.

లోపలున్న శశాంక్ బయటకొచ్చి. "ఆశీర్వదించండి తాతయ్యా!" అంటూ వంగి తాతగారి కాళ్ళకి నమస్కరించి మళ్ళీ లోనికి వెళ్ళిపోయాడు.

ప్రేక్షకుడిలా చూస్తుండిపోయాడు అనంతరామయ్య.

"మమ్మల్నెలాగూ డాక్టర్స్‌ని, ఇంజనీర్స్‌ని చేయలేకపోయారు. కనీసం మా పిల్లలకైనా అలాంటి చదువులు చెప్పించుకోనీయండి." అన్నాడు శేఖర్ మెల్లగా.

సర్రున తలెత్తాడాయన. సూటిగా కొడుకు కళ్ళలోకి చూశాడు.

తీవ్రంగా మటుకు కాదు. శూన్యంగా, నిస్సారంగా ఉన్నాయతని చూపులు.

'నువ్వు యస్సెస్సీ ఎన్నిసార్లు తప్పావో, ఇంటర్ ఎప్పటికి పాసయ్యావో అప్పుడే మర్చిపోయావా?' ఇక వీడు చదవడు. మాన్పించేద్దామని నేను విసుక్కుంటే "చాల్లెండి, ఈసారికాకపోతే మరోసారి." అంటూ మీ అమ్మ నిన్నొక్కణ్ణే పట్టుకుని నీ చేత పట్నంలో డిగ్రీ చదివిస్తుంటే మన కుటుంబం నానా ఇబ్బందుల పాలయ్యిందన్న విషయం అప్పుడే స్మృతిలో లేకుండా పోయిందా?

అరేయ్! అదొట్టి వెర్రి బాగుల్దిరా "పెద్దవాడ్ని తండ్రీ... చిన్నవాడ్ని తల్లీ... ప్రేమగా చూస్తార్ట. నడిపివాడు ఎవరిప్రేమకి నోచుకోకుండా మిగిలిపోతాడని అంటారు కదా. మనమలా చేయకూడదండీ." అంటూ ముగ్గుర్నీ ప్రాణంలా చూసుకునేది కదరా!'

పైకి అనలేకపోయాడు. గొంతులోనే నొక్కేసాడు.

తండ్రి నుండి సమాధానం రాకపోయేసరికి తిరిగితనే అన్నాడు శేఖర్.

"నా దగ్గర వెతికితే లక్ష అవ్వొచ్చు నాన్నా! శశా ఇంజినీరింగ్ ఫీజు, ఖర్చులూ వగైరాలకు సరిపోతాయవి. చిగురిస్తున్న చిగురాకు వాడు. రాలడానికి సిద్ధమైన పండుటాకు అమ్మ. ఇద్దర్లో ఆ డబ్బెవరికి ఉపయోగించాలో నిర్ణయం మీ చేతుల్లో పెడుతున్నాను." అని నిర్మొహమాటంగా చెప్పేశాడు.

'భానూ! అమాయకుడని వెనకేసుకొచ్చిన నీపుత్రరత్నమెంత తెలివైన వాడో చూస్తున్నావా?' అనంతరామయ్య మనసు మూగగా రోదించింది.

"నిజమే బాబూ! చిగురాకుల శోభే చెట్టుకి వసంతం. పండుటాకులు ముందో వెనకో రాలిపోవాల్సిందేగా! అదే ప్రకృతి ధర్మం కూడా. శశాంక్‌కి ఫీజు కట్టడమే న్యాయం. వాడి బంగారు భవిష్యత్‌ని నా భార్య చావుకి ముడిపెట్టడం భావ్యం కాదు. వెళ్ళొస్తానిక." అంటూ నిలువెత్తు శోకమూర్తిలా కదిలిపోయాడక్కడినుండి.

★ ★ ★

చిన్నకొడుకు గోపిచంద్‌ని కలిసి, "ఒరేయ్ చిన్నా! మీ అమ్మ చావుబ్రతుకుల్లో వుంది. ఆమె జీవితం మటుకు నీ చేతుల్లో వుంది." అన్నాడు అనంతరామయ్య ఆందోళనగా.

"మీరు మాట్లాడేది నాకు ఒక్క ముక్కా అర్థం కావడం లేదు. ఏవిటి నాన్నా! అమ్మకేమైంది?" అనడిగాడు గోపి అయోమయంగా.

తండ్రి చెబుతున్నదేంటో వెంటనే అర్థం కాలేదతనికి.

భార్య గురించి వివరంగా చెప్పాడు అనంతరామయ్య.

"రెండు లక్షలు కావాలి బాబూ! మీ అన్నయ్యలిద్దరూ చేతులెత్తేసారు. నీవు సాయం చేయకపోతే అమ్మ... మీ అమ్మ దక్కదురా" గొంతు జీరబోయింది కొడుక్కి చెబుతుంటే.

ఆయనకిక దుఃఖం ఆగడం లేదు. ఆపుకోనూ లేదు. పసిపిల్లాడిలా ఏడ్చేశాడు.

కొడుకు విషయం తెలుసు. కానీ కోడలు మాత్రం చలించిపోయింది. పెద్ద మనిషి అలా ఏడ్వడంతో.

"ఊర్కోండి మావయ్యా! పెద్దవారు మీరలా ఏడిస్తే ఎలా? మేమున్నాం గా ఫోన్ చేస్తే సరిపోయేది. రెక్కలు కట్టుకుని మీ ముందు వాలే వాళ్ళం కదా!" అంది ఆయన ఫీలింగ్స్‌ని చూస్తూ తట్టుకోలేక.

వెంటనే రియాక్టయ్యాడు గోపి.

"ఆయనక్కావాల్సింది మనం రెక్కలు కట్టుకుని అక్కడ వాలడం కాదుట. రెండు..రెండు లక్షలు కావాలిట." అంటూ అరచినంత పనిచేశాడు భార్యమీద.

కిక్కురుమనలేదామె.

భర్త చర్యకి గమ్మున ఊర్కుండిపోయింది.

"నిజమేరా! ఇప్పుడు కావాల్సింది ఓదార్పు కాదు. ఓ రెండు లక్షలు. పెళ్ళయి రెండేళ్ళేగా అవుతోంది. ఖర్చు లేముంటాయ్ నీకు. పైగా మూడు లక్షల కట్నమిచ్చారు. అందులో..." బాధని దిగమ్రింగుకుంటూ మాటల్ని మింగేసాడాయన.

"కానీ కట్నం డబ్బు వాళ్ళింకా ఇవ్వలేదు." వెంటనే అన్నాడు గోపి.

"ఇప్పుడు వెళ్ళి అడుగు పరిస్థితి వింటే కాదనరుగా."

"అదీ...అదీ.." నీళ్ళు నమిలాడు.

'ఒరేయ్ చిన్నోడా! నీ ఉద్యోగం చూపి కదరా వాళ్ళంత కట్నమిచ్చి ఈ అమ్మాయితో నీ వివాహం జరిపించారు. మన పెంకుటిల్లు అమ్మగా వచ్చిన డబ్బులంచంగా ఇస్తే కదరా ఆ ఉద్యోగం నీకొచ్చింది. 'వృద్ధాప్యంలో మనకి నిలువ నీడ కూడా లేకపోతే ఎలా?' అని నేనెంత మొత్తుకున్నా వినకుండా "ఇద్దరికీ ఉద్యోగాలయ్యాయి. చిన్నాడికి ఉద్యోగం లేకపోతే ఎలాగండీ! వాడి భవిష్యత్ ఏంగాను" అంటూ పట్టుబట్టి తన పేరు మీదున్న ఆ పెంకుటిల్లు అమ్మించిందిరా మీ అమ్మ. అలాంటి తల్లి కోసం... ఒక్కడు ఒక్కడు కూడా డబ్బులు త్యాగం చేయడం లేదేంట్రా?'

నీళ్ళు చిప్పిల్లాయా వృద్ధనేత్రాల్లో.

ఓర్పు...బాధను దిగమ్రింగుకునే నేర్పు... జీవితం నేర్పిందతనికి.

"ఎందుకురా అబద్ధాలాడ్తావ్..." అని మాత్రం అనగలిగాడు పైకి.

"అబద్ధాలు కాదునాన్నా! నిజమే చెబుతున్నా, మీ కోడలు కడుపులో ఓకాయ కాసేవరకూ ఆ డబ్బు ఇవ్వమని చెప్పారు." అన్నాడు.

బదులేమంటాడు అనంతరామయ్య.

ఎదిగొచ్చిన కొడుకులు ఎద బాధను తొలగిస్తారనుకుంటే... గుదిబండల్లా భావిస్తూ తమని దూరంగా తరిమి తరిమి కొడుతుంటే...!

'కాలం చెల్లి గాలివాటుకి పండుటాకులు రాలిపోవాలి గానీ, ఎలాగూ కిందపడాల్సిన వేనని బలవంతంగా త్రుంచి వేస్తే... అంతకుమించిన అమానుషం మరొకటుంటుందా?'

ఆలోచిస్తూ లేచాడు అనంతరామయ్య.

గుండె దిటవు చేసుకున్నాడు. ఇక ఒక్కక్షణం ఉండలేదక్కడ. వడి వడిగా బయల్దేరాడు.

★ ★ ★

'కొడుకుల్ బుట్టరటంచు నేడ్తు రవివేకుల్ జీవన భ్రాంతులై...'

(జీవితం మీద మోహంతో అవివేకులు కొడుకులు పుట్టలేదని ఏడుస్తారు. ధృతరాష్ట్రునికి చాలా మంది పుత్రులు పుట్టలేదా ? వారి వలన అతడు ఏ గతులు పొందాడు? పుత్రులు లేని శుకునికి ఏ నరకం వచ్చింది? పుత్రులు లేనివారికి మోక్షం రాకుండా వుండదు కదా?)

వ్యథాభరితుడైన ఆ వృద్ధ పండితుడి గొంతులోంచి పద్యం లయబద్ధంగా జాలువారుతోంది.

'పుత్రులు కలిగినప్పుడే తల్లిదండ్రులు సంతోషించడం సరికాదు. వారు ప్రయోజకులై, జనం పొగుడుతుంటే అప్పుడు పుత్రోత్సాహాన్ని అనుభవించాలి.' అన్నాడు వేమన కూడా.

అది ఈ కాలానికి వర్తిస్తుందా?

అనంతరామయ్య మనసు ఘోషించింది మూగగా.

తల్లిదండ్రుల మాట జవదాటకుండా వుండడం. కన్నవాళ్ళని వృద్ధాప్యంలో కంటికి రెప్పలా కాపాడుకోవడం నాడు సహజరీతిలో సాగేవి. అదే లోకధర్మం కూడా. నేడది మృగ్యమైపోయింది.

వృద్ధాప్యంలో తల్లిదండ్రుల్ని చేరదీసి, ఆదరించి, ఆప్యాయతల్ని కురిపించి, వారి బాగోగుల్ని చూసేవాడే నిజమైన కొడుకు. అప్పుడే ఆ తల్లిదండ్రులు పుత్రోత్సాహంతో పొంగిపోవాలి.

ఇదే పుత్ర ధర్మం. ఈ పుత్రధర్మాన్ని పాటించేవాడే నిజమైన పుత్రుడు. ఇలాంటి కొడుకుల్ని కన్నవాళ్ళే ధన్యులు. అని అనుకుంటూ మూగగా రోదిస్తున్న అనంతరామయ్య

ఆవేదనగా ముందుకు కదిలిపోయాడు.

★ ★ ★

భానుమతమ్మ కోలుకుంది.

తలెత్తి హాస్పిటల్ గదంతా కలియజూస్తూ ఆమె గొంతులోంచి వెలువడిన మొట్టమొదటి మాట.

"ఏవండీ! మన పిల్లల్లేరీ? ఒక్కరూ కన్పించరే?" అని.

అనంతరామయ్య నిర్వేదంగా చూశాడు భార్యవంక అతని ముఖంలో నిర్లిప్తత చోటుచేసుకుంది.

'మనకి పిల్లలు పుట్టలేదనుకో భానూ! పుట్టినా చచ్చారనుకో. నాకు నువ్వు, నీకు నేను తప్ప. మనకిక ఎవరూలేరు.' గుండెలో ప్రతిధ్వనించినా భార్యతో అనలేకపోయాడు.

ఆమె తట్టుకోలేదని కొడుకుల స్వరూపం ఆమెకి చెప్పకుండా మౌనంగా వుండిపోయాడు.

అదేకాదు. తన కిడ్నీ అమ్మి ఆమెని బ్రతికించుకున్నాడన్న నిజం కూడా భార్యకి చెప్పకుండా దాచి పెట్టాడు.